

ప్యాలెస్ కాదు.. వైసీపీ కార్యాలయం

ఆ పార్టీ విశాఖ నేతల బరితెగింపు

- ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- ఎకరా రూ.50 కోట్ల విలువైన భూమికి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున చెల్లింపు

· 7లో

వరి రైతుకు దక్కని మద్దతు



మద్దతు ధరపై రైతన్న పెదవివిరుపు

- గత ఏడాది రూ.143 పెంపు.. ఈ ఏడాది రూ.117తోనే సరి
- పదేళ్లలో క్వింటాలుపై పెరిగింది రూ.890 మాత్రమే
- భారీగా పెరిగిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు, కూలీ రేట్లు
- వరిసాగుపై సన్నగిల్లుతున్న ఆసక్తి

చోడవరం, జూన్ 20:

కేంద్ర ప్రభుత్వం వరి పంటకు తాజాగా ప్రకటించిన మద్దతు ధర మరోసారి అన్నదాతకు నిరాశనే మిగిల్చింది. వరి క్వింటాలుకు తాజా ఖరీఫ్ సీజన్‌కు గత ఏడాదికంటే కేవలం రూ.117 పెంచింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన ధరల ప్రకారం కామన్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2300, ఏ గ్రేడ్ రకం క్వింటాలు రూ.2320లు వరి పండించే రైతులకు దక్కనుంది.

వరికి మద్దతు ధర గత పదేళ్లుగా ఇలా..

సంవత్సరం	కామన్ రకం (రూ.లలో)	ఏ గ్రేడ్ (రూ.లలో)
2015- 16	1410	1450
2016- 17	1470	1510
2017- 18	1550	1590
2018- 19	1750	1770
2019- 20	1815	1835
2020- 21	1868	1888
2021- 22	1940	1960
2022- 23	2040	2060
2023- 24	2183	2203
2024- 25	2300	2320

గత సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది వరి విత్తనాల ధరలు ఇలా..

విత్తనం	రకం	కిలోలు (బస్తా)	గత ఏడాది ధర (రూ.లలో)	ఈ ఏడాది ధర (రూ.లలో)
బీపీటీ	5204	25	697. 50	795
ఎంటీయూ	1121	30	834.00	894
ఎంటీయూ	1064	30	843.00	894
బీపీటీ	3291	30	819.00	834
ఆర్‌జే ఎల్	2537	30	834.00	954

గత ఏడాది క్వింటాలుపై రూ.143 పెంచిన కేంద్ర ప్రభుత్వం, ఈ ఏడాది మాత్రం 117 రూపాయలు మాత్రమే పెంచి మమ అనిపించింది. ఒక పక్క కేంద్రం వరికి క్వింటాలుకు రూ.117 మద్దతు ధర పెంచగా, ఇదే సమయంలో వరి విత్తనాల బస్తా ధర రూ.35 నుంచి రూ.120 వరకు పెరగడం రైతులను అసంతృప్తికి గురిచేస్తోంది, ప్రతి ఏటా కూలీలు, ఎరువులు, పురుగుమందుల ధరలు విపరీతంగా పెరిగి సాగు పెట్టుబడి భారీగా పెరుగుతున్నా, కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలు మాత్రం నిరాశను కలిగిస్తుండడంతో అన్నదాతలు మద్దతు ధరపై పెదవి విరుస్తున్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం వరి పండించే రైతులకు కనీసం పెట్టుబడి డబ్బులు కూడా రావని అంటున్నారు. వరి సాగుకు సంబంధించి గతంతో పోల్చిచూస్తే పెట్టుబడులు రెట్టింపయ్యాయి. వరి విత్తనాల దగ్గర నుంచి అన్ని రకాల ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాలకు అయ్యే ఖర్చులతో పాటు కూలీల ఖర్చులు కలిపి వరి సాగుకు అయ్యే పెట్టుబడి వేల రూపాయల్లో పెరిగిపోతుంది. ప్రభుత్వం పదేళ్లలో వరికి పెంచిన మద్దతు ధర క్వింటాలుపై కేవలం రూ.890 ఉండడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. సాగు ఖర్చులకు, మద్దతు ధరకు మధ్య ఈ స్థాయిలో వ్యత్యాసం భారీగా ఉండడంతో వరి సాగు తమకు భారంగా మారిపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిపోయిన పెట్టుబడి

యూరియా బస్తా మినహా ఇతర ఎరువుల కాంప్లెక్స్ ధరలు కానీ, పురుగుమందుల ధరలు కానీ అన్నీ కొంతకాలంగా పెరుగుతూ వస్తున్నాయి. డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ధరలు కూడా అటు ఇటుగా పెరుగుతూనే ఉన్నాయి. ఉపాధి పథకం వల్ల గ్రామాల్లో కూలి రేట్లు కూడా బాగా పెరిగిపోయి కూలీలు అందుబాటులో లేకుండా పోతున్నారు. అలాగే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది వరి విత్తనాల ధరలు కూడా బస్తాకు రూ. 35 నుంచి రూ.120ల వరకు పెరిగింది. ఆర్‌జేఎల్ బస్తాపై గత ఏడాది కంటే రూ.120 అదనంగా పెరిగింది. మిగిలిన విత్తనాల ధరలు కూడా గతం కంటే ... మిగతా 8వ పేజీలో

వరి కలిసిరాక సరుగుడు తోట వేశా..



పెరిగిన విత్తనాల ధరలు, కూలీల రేట్లతో వరిసాగు పెట్టుబడి ఖర్చులు రావడం లేదు. ధాన్యం అమ్ముకోవడానికి కూడా కష్టాలు తప్పడం లేదు. అందుకే వరి వదిలేసి సరుగుడుతోట వేశాను. రైతులు వరి పండించాలంటే గిట్టుబాటు ధర రూ.100, రూ.200 పెంచితే సరిపోదు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందజేయాలి.

- తోట దేముడు, రైతు, గుమ్మాళ్లపాడు, రావికమతం

బదిలీల టెన్షన్

వైసీపీతో అంటకాగిన అధికారుల్లో ఆందోళన

- నిబంధనలు ఉల్లంఘించి చెలరేగిపోయిన ఉద్యోగుల్లో గుబులు



నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇంటి గోడను కూల్చి వేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలకులతో అంటకాగిన అధికారుల్లో ఇప్పుడు గుబులు మొదలైంది. వైసీపీ పెద్దలు చెప్పిందే వేదంగా భావించి నిబంధనలను సైతం పట్టించుకోకుండా చెలరేగిపోయిన అధికారుల్లో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి పాలనపై దృష్టి సారించడంతో వైసీపీ నేతల అడుగులకు మడుగులొత్తిన రెవెన్యూ, పోలీసు శాఖలతో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగుల్లో ఇప్పుడు బదిలీల టెన్షన్ ఆరంభమైంది.

జిల్లాలో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి గోడను కూలదోయడంలో అప్పట్లో కొందరు అధికారులు స్థానిక వైసీపీ నేతల మాటలు విని అత్యుత్సాహం ప్రదర్శించారు. అలాగే అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ల పరిధిలో తహసీల్దారు కార్యాలయాల్లో కొందరు అధికారులు స్థానిక వైసీపీ నేతల కనుసన్నల్లోనే పనిచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాడుగుల నియోజకవర్గం తారువ గ్రామంలో కొంతమంది అధికారులు వైసీపీ నేత ఆజ్ఞలకు తలొగ్గి విపక్ష నేతలపై దురుసుగా వ్యవహరించారు. అనకాపల్లి, కశింకోట తహసీల్దారు కార్యాలయాల్లో కొంతమంది అధికారులు వైసీపీ నేతలు చెప్పినట్లే నడుచుకొని వారి అక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేశారు. కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలో వైసీపీ మంత్రి అనుచరులు దర్జాగా ప్రభుత్వ కొండ భూములను కబ్జా చేసి లేఅవుట్‌లు వేశారు. అంతే కాకుండా కొండలను పిండి చేసి పెద్దఎత్తున గ్రావెల్ దందాకు పాల్పడ్డారు. రూ.కోట్లు విలువైన గ్రావెల్ అమ్ముకున్న వైనంపై అనేక పర్యాయాలు టీడీపీ, జనసేన నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం చర్యలు చేపట్టలేదు. అనకాపల్లి తహసీల్దారు కార్యాలయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇక్కడే తిష్ట వేసిన ఓ అధికారి వైసీపీ జరిపిన భూ సమీకరణలో పెద్దఎత్తున అక్రమాలకు తన వంతు సహకారం అందించారు. ఆయనపై గతంలో టీడీపీ, జనసేన నాయకులు అనేకసార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ఎలమంచిలి, మాడుగుల, చోడవరం, పాయకరావుపేట నియోజకవర్గాల్లో కొందరు రెవెన్యూ, పోలీసు శాఖల్లోని అధికారులు వైసీపీ అరాచకాలకు తమ వంతు ప్రోత్సాహాన్ని అందజేశారు. ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తున్నారని పరవాడ తహసీల్దారు కార్యాలయంలో ఒక అధికారికి ఫిర్యాదులు అందినా స్థానిక వైసీపీ నేతల ఒత్తిళ్లకు లొంగి కనీసం చర్యలు చేపట్టలేదు. దీనిపై కొందరు లోకాయుక్తను ఆశ్రయించారు. అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో ఓ వైసీపీ నేత గ్రావెల్ దందాపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. అదే విధంగా అనకాపల్లి మండలం పరిధిలో గనులు, రెవెన్యూ శాఖల్లో కొంతమంది అధికారులు అనధికార కంకర క్వారీలను నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నేతల ఆదేశాలతో నడిపించారు. జిల్లాలో గత ఐదేళ్లలో పని చేసి ప్రస్తుతం ఇక్కడే కొనసాగుతున్న వివిధ మండలాలకు, జిల్లాకు బదిలీపై వచ్చిన ఉద్యోగుల వివరాలు నిఘా విభాగం సేకరించిన జాబితాలో ఉన్నట్టు తెలుస్తోంది. వీరందరికీ త్వరలోనే బదిలీలు తప్పవనే ప్రచారం ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కొంతమంది ఉద్యోగులు మళ్లీ తమ స్థానాలను పదిలం చేసుకొని, బదిలీ లేకుండా చేసుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు

మూడేళ్లుగా చేతులెత్తేసిన వైసీపీ ప్రభుత్వం

- ప్రభుత్వం మారడంతో ఈ ఏడాది నుంచి మళ్లీ పంపిణీ
- వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో 22 వేల విద్యార్థులకు లబ్ధి

విశాఖపట్నం, జూన్ 20:



ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేయడానికి విద్యా శాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ చర్యలు చేపట్టారు. వచ్చే నెల 15వ తేదీ నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీనివల్ల ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సుమారు 22 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడచిన మూడు విద్యా సంవత్సరాల నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ నిలిపివేసింది. విద్యా వ్యవస్థలో విప్లవం తీసుకొస్తామన్న వైసీపీ పాలకులు కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించలేకపోయారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది 2008 నాటి 'పుస్తక ప్రసాదం' అనే పాత పథకాన్ని పునరిద్ధరించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కోరింది. ప్రభుత్వ కోర్కె మేరకు 2019-20 విద్యాసంవత్సరానికి టీటీడీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసింది. ఆ తర్వాత ఏడాది నుంచి పుస్తకాల పంపిణీ నిలిపివేసింది. దీంతో గత మూడేళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పాఠ్య పుస్తకాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని కళాశాలల అధ్యాపకులు ఓల్డ్ స్టూడెంట్స్ వద్ద పుస్తకాలు సేకరించి పేద విద్యార్థులకు పంచిపెట్టారు. మరికొందరు తమ వద్ద పాఠ్య పుస్తకాలతో క్లాసులు చెప్పి, నోట్స్ రాయించి మూడేళ్లు మేనేజ్ చేశారు.

మంత్రి ఆదేశాలతో 22 వేల మందికి లబ్ధి...

జూలై 15 నాటికి విద్యార్థులందరికీ పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించడంతో ఉమ్మడి జిల్లా వృత్తివిద్యాశాఖాధికారులు కసరత్తు ప్రారంభించారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని 39 ప్రభుత్వ, ఎయిడెడ్, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ, హైస్కూల్ ప్లస్, కేజీబీవీ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం 11,654 మంది చదువుతున్నారు. ఇప్పటివరకూ ప్రథమ సంవత్సరంలో సుమారు 8,500 మంది విద్యార్థులు చేరారు. నెలాఖరులోగా మరో మూడు వేల మంది చేరే అవకాశం ఉంది. ఈ చేరికలను ఆధారంగా ఆంగ్లం, తెలుగు మీడియం సైన్స్, ఆర్ట్స్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి సుమారు 22 వేల మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు ప్రింట్ చేయడానికి జాబితా రూపొందించి ఇంటర్ బోర్డుకు పంపించారు.


ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం

ఉద్యాన పంటల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి

- ఉపాధి హామీ పథకంతో అనుసంధానం
- ఉద్యాన రైతుల్లో ఆనందం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఉద్యాన పంటల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేయనుంది. దీనిలో భాగంగా ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటలతో అనుసంధానం చేసింది. ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ దస్త్రంపై తొలి సంతకం చేయడంతో జిల్లాలోని ఉద్యాన రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది.



అనకాపల్లి మండలంలో జీడిమామిడి తోట

గతంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద కేవలం ఎస్సీ, ఎస్టీ , చిన్న, సన్నకారు రైతులు కొంతమందిని మాత్రమే ఎంపిక చేసి వారి ద్వారానే ఉద్యాన పంటల సాగు చేపట్టేవారు. కొత్తగా మొక్కలు నాటించి వారికి సబ్సిడీ అందించి తగిన ప్రోత్సాహాన్ని అందించేవారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకంతో ఉద్యాన పంటల పనులు అనుసంధానం చేసి ఉద్యాన రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయనుంది. ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి వ్యయం ఎక్కువగా పెట్టాల్సి వున్నందున భూమి విస్తీర్ణం తక్కువగా వున్న చిన్న, సన్నకారు రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు రావడం లేదు. అయితే ఇక ముందు ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయడం ద్వారా ప్రభుత్వమే చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీ అందించి వారు 13 రకాల పండ్ల తోటలు సాగు చేసే విధంగా ప్రోత్సాహాన్ని అందించనుంది. మామిడి, జీడి మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సీతాఫలం, సపోటా, మునగ, డ్రాగన్‌ఫ్రూట్స్, అరటి, దానిమ్మ, కొబ్బరి రకాలతో పాటు కూరగాయల పంటల సాగుకు సాయమందించాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఉన్న ఉద్యాన పంటల నిర్వహణ పనులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేయనున్నారు. జిల్లాలో 52 వేల హెక్టార్లలో ఉద్యాన పంటల సాగులో ఉన్నాయి. మామిడి, జీడిమామిడి, నిమ్మ, సీతాఫలం, జామ వంటి పండ్ల జాతి పంటల సాగుతో పాటు వివిధ రకాల కూరగాయల సాగు జరుగుతోంది. వీటిని ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసేందుకు అవసరమైన ప్రణాళికను జిల్లా నీటియాజమాన్య సంస్థ, ఉద్యాన శాఖాధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉద్యాన పంటల అనుసంధానం, అభివృద్ధిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా అందాల్సి వుందని, ప్రస్తుతం ఎంతమంది ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు?, ఇంకా ఎంత విస్తీర్ణంలో సాగుకు అనుకూలం అనే వివరాలు మాత్రమే సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉద్యాన పంటలకు ప్రోత్సాహాన్ని అందజేస్తామని జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు.

పెట్టుబడి భారం తగ్గుతుంది



ఉద్యాన పంటల నిర్వహణ పనులకు పెట్టుబడులు భారీగా పెట్టాల్సి వస్తున్నది. ఉపాధిహామీ పథకం పనులతో అనుంసధానం చేయడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ప్రభుత్వం ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకం ద్వారా మరింత ప్రోత్సాహాన్ని అందిస్తామని ప్రకటించడం మంచి పరిణామం.

- పరవాడ దేముడు, రైతు, రోలుగుంట

ప్రభుత్వ నిర్ణయంతో రైతుకు లాభం



ఉద్యాన పంటలు వేయాలంటే పెట్టుబడులు ఎక్కువగా పెట్టాల్సి ఉంటుంది. పెట్టుబడులు లేక మామిడి, జీడిమామిడి తోటలు వేయలేకపోతున్నాం. కూరగాయల పంటలు పండించాలన్నా పెట్టుబడులు పెట్టాల్సిందే. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తే చిన్న, సన్నకారు రైతులు ఎంతగానో లాభపడతారు.

- వి.వెంకటరావు, రైతు, కె.కోటపాడు



గాంధీనగరంలో నిర్మాణంలో ఉన్న అతిథి గృహం

శరవేగంగా జీవీఎంసీ అతిథి గృహ నిర్మాణం

గాంధీనగరంలో రూ.1.98 కోట్లతో పనులు

అనకాపల్లి టౌన్, జూన్ 20: స్థానిక గాంధీనగర్‌లో అధునాతన జీవీఎంసీ అతిథి గృహ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. రూ.1.98 కోట్లతో రెండు నెలల క్రితం ఈ అతిథి గృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. రెండు ఫ్లోర్లులో ఆరు సూట్‌లు నిర్మిస్తున్నారు. కింద భాగంలో రిసెప్షన్ కౌంటర్, వెయింటింగ్ హాల్‌తో పాటు కిచెన్ గది ఏర్పాటు చేస్తున్నారు. పై రెండు ఫ్లోర్లులో అతిథుల కోసం సూట్‌ల నిర్మాణం చేపట్టారు. అనకాపల్లిలో ఒక్క అతిథి గృహం కూడా లేకపోవడంతో ఇక్కడికి వచ్చే ప్రజాప్రతినిధులు, వీఐపీల సౌకర్యార్థం అందుబాటులో ఉండేలా దీనిని నిర్మిస్తున్నారు. గాంధీనగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహం ఐదేళ్ల క్రితం శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారింది. ఆర్ అండ్ బీ అధికారులు ప్రస్తుతం ఉన్న భవనం స్థానంలో కొత్తది నిర్మాణం చేపట్టేందుకు నిధులు లేక చేతులెత్తేశారు. 2008లో మంత్రిగా ఉన్న కొణతాల రామకృష్ణ జీవీఎంసీ జోనల్ కార్యాలయానికి ఎదురుగా జడ్పీ గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. అయితే అనతికాలంలోనే ఆర్డీవో కార్యాలయం మంజూరు కావడంతో ఆ అతిథి గృహంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పట్టణానికి వచ్చే వీఐపీలు హోటళ్లలో బస చేస్తున్నారు. విశాఖ నగరంలో మాదిరిగా అనకాపల్లిలో సర్క్యూట్‌హౌస్ నిర్మాణం చేపట్టాలని జీవీఎంసీ అధికారులు భావించారు. ఎట్టకేలకు గాంధీనగరం ప్రాంతంలో ఉన్న జీవీఎంసీ స్థలంలో అతిథి గృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం శ్లాబు స్థాయిలో పనులు జరుగుతున్నాయి. డిసెంబరు నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు.

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన

- హెచ్‌ఎంలకు ఆర్‌జేడీ విజయభాస్కర్ ఆదేశం

కశింకోట, జూన్ 20: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) బి.విజయభాస్కర్ ఆదేశించారు. గురువారం స్థానిక సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూలులో అనకాపల్లి జిల్లాలోని 24 మండలాల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించడమే కాకుండా క్రమశిక్షణతో ఉండే విధంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ, ఉప విద్యాశాఖాధికారి ఇ.అప్పారావు, ఎంఈవో చిట్టిబాబు, ఎంఈవో-2 మూర్తి, 300 మంది ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్, హాజరైన ప్రధానోపాధ్యాయులు

ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు

నర్సీపట్నం, జూన్ 20: ఒకేషనల్ కళాశాల విద్యార్థినిపై ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ కాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మాకవరపాలెం మండలానికి చెందిన ఓ వివాహిత నర్సీపట్నం డీఎంకే ఒకేషనల్ కళాశాలలో వెటర్నరీ కోర్సు ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురువారం మధ్యాహ్నం కళాశాల ప్రిన్సిపాల్ సోరీ ఉరఫ్ మునలయ్య (35) ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సుధాకరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్యాలెస్ కాదు.. వైసీపీ కార్యాలయం!

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'రాష్ట్రంలో అక్రమ భవనాలు ఉండడానికి వీల్లేదు. అలాంటి వాటిని మా ప్రభుత్వం ఉపేక్షించదు. ప్రజా వేదిక కూడా అలాంటిదే కాబట్టి కూల్చేస్తున్నాం' అంటూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గొప్పలు చెప్పుకొన్నారు. ఆ హడావుడి అంతా ప్రజావేదిక కూల్చివేత వరకే.. ఆ తరువాత ఏ అనధికార నిర్మాణాన్నీ తొలగించింది లేదు. అంతేకాదు ఆయన పార్టీ కూడా అనుమతులు లేకుండా అనేక అక్రమ నిర్మాణాలు చేపట్టింది. ఈ జాబితాలో విశాఖ నగరంలో వైసీపీ కార్యాలయం కోసం చేపట్టిన భవనం కూడా ఉంది.

ఆ పార్టీ విశాఖ నేతల బరితెగింపు

- ఎండాడలో రెండెకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు
- ఎకరా రూ.50 కోట్ల విలువైన భూమికి ఏడాదికి రూ.వెయ్యి చొప్పున చెల్లింపు
- 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తూ ఉత్తర్వులు
- దీనిపై అప్పట్లోనే వెల్లువెత్తిన విమర్శలు
- అధికార పార్టీ కావడంతో నోరెత్తని అధికారులు
- జీవీఎంసీ అనుమతి లేకుండానే భవన నిర్మాణం
- ప్రభుత్వం మారడంతో యంత్రాంగంలోనూ, నేతల్లోనూ ఆందోళన
- తాజాగా ప్లాన్ అనుమతికి దరఖాస్తు


విశాఖ నగర పరిధిలో ఎండాడ సర్వే నంబర్ 175/4లో ప్యాలెస్ మాదిరిగా నిర్మించిన వైసీపీ కార్యాలయం

చేతిలో అధికారం ఉంది కదా అని వైసీపీ నేతలు విశాఖ ఐటీ సెజ్ సమీపంలో అత్యంత విలువైన రెండెకరాల భూమిని లీజు పేరుతో కారుచౌకగా దక్కించుకున్నారు. అందులో జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే ప్యాలెస్‌ను తలదన్నేలా పార్టీ కార్యాలయం కోసం భారీ భవనం నిర్మించేశారు. అప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కావడంతో అధికారులు కూడా నోరెత్తే సాహసం చేయలేకపోయారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో అక్రమ భవన నిర్మాణం అంశం ఎక్కడ తమ పీకకు చుట్టుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా 2022 మే 16న పీఎంపాలెం సమీపాన ఎన్‌వీపీ లా కాలేజీ నుంచి ఐటీ హిల్స్‌కు వెళ్లే రోడ్డును ఆనుకుని పనోరమ హిల్స్ సమీపంలో ఎండాడ సర్వే నంబర్ 175/4లో రెండెకరాల ప్రభుత్వ భూమిని పార్టీ కార్యాలయం నిర్మాణానికి కేటాయించుకున్నారు. ప్రస్తుతం అక్కడ భూమి ధర ఎకరా రూ.50 కోట్లు పైగా పలుకుతుంది. అంటే రెండు ఎకరాల భూమి విలువ రూ.వంద కోట్లు. ఆ భూమిని ఏడాదికి (ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి) కేవలం రూ.రెండు వేలు చెల్లించేలా 33 ఏళ్లపాటు లీజుకు ఇస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఐదేళ్ల లీజు మొత్తం (రూ.పది వేలు) ముందుగానే చెల్లించాలని, తర్వాత ప్రతి ఐదేళ్లకు లీజు మొత్తాన్ని పది శాతం చొప్పున మాత్రమే పెంచేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వానికి చెందిన భూమిని కారుచౌకగా అధికార పార్టీకి కట్టబెట్టడంపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. జీవీఎంసీ నుంచి అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ప్యాలెస్‌ను తలపించేలా ఆ స్థలంలో భారీ భవనాన్ని నిర్మించారు. భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉండగానే గత ఏడాది సెప్టెంబరు రెండో తేదీన పార్టీ కార్యాలయాన్ని హఠాత్తుగా ప్రారంభించేశారు. ఒకవైపు భవన నిర్మాణపనులు జరుగుతుంటే మరోవైపు అక్కడే పార్టీ సమావేశాలు నిర్వహించేవారు. ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకూ పార్టీ నేతలు, కార్యకర్తలతో కార్యాలయం కళకళలాడుతుండేది. ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత కార్యాలయం ముఖం చూసే వారు లేకపోవడంతో ప్రస్తుతం బోసిపోతోంది.

ప్లాన్ లేకుండానే భవన నిర్మాణం

జీవీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే వైసీపీ నేతలు పార్టీ కార్యాలయం కోసం ప్యాలెస్ మాదిరిగా భారీ భవంతిని నిర్మించేయడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎవరైనా చిన్న ఇల్లు కట్టుకున్నా ప్లాన్ తప్పనిసరి అని బెదిరించే టౌన్ ప్లానింగ్ అధికారులు.. ఎలాంటి ప్లాన్ లేకుండా భారీ భవన నిర్మాణం జరుగుతున్నా పట్టించుకోకపోవడం విశేషం. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం వైసీపీ నేతలు మీసాల వెంకట సుబ్రసాయిశరణ్ అనే లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) ద్వారా ప్లాన్‌కు గత ఏడాది జనవరి 12న దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫీజు కింద రూ.10 వేలు చెల్లించి వదిలేశారు. లీజు భూమిలో నిర్మాణం కావడంతో గ్రామ పంచాయతీ చార్జీల కింద రూ.4.44 లక్షలు, పర్మిట్ ఫీజు కింద రూ.10.44 లక్షలు, గ్రీన్ ఫీజు కింద రూ.33 వేలు, డీపీఎంఎస్ యూజర్ చార్జీలు కింద రూ.500, లేబర్ సెస్ చార్జీల కింద రూ.1.54 లక్షలు.. మొత్తం సుమారు రూ.17 లక్షలు జీవీఎంసీకి చెల్లించాలి. ఆ ఫీజులన్నింటినీ చెల్లించిన తర్వాత భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, భవన నిర్మాణానికి సంబంధించిన డిజైన్, డ్రాయింగ్‌ను ఎల్‌టీపీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డాక్యుమెంట్లు అన్నీ సరైనవేనని ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ అయిన తర్వాత బిల్డింగ్ ప్లాన్ నంబర్ జనరేట్ అవుతుంది. తర్వాత ప్లాన్ అప్లికేషన్ సంబంధిత వార్డు సచివాలయంలోని వార్డు ప్లానింగ్ సెక్రటరీ పరిశీలనకు వెళుతుంది. ప్లానింగ్ సెక్రటరీ భవన నిర్మాణం ప్రతిపాదిత స్థలానికి వెళ్లి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లలో ఉన్నట్టుగానే భూమి కొలతలు, రోడ్డు కనెక్టివిటీ ఉనదీ లేనిదీ పరిశీలిస్తారు. సక్రమంగా ఉన్నట్టు నిర్ధారిస్తే తనపై అధికారికి, అలా కమిషనర్ వరకూ అప్లికేషన్ వెళ్లి అక్కడ ప్లాన్ అప్రూవల్ జరుగుతుంది. కానీ వైసీపీ కార్యాలయం ప్లాన్ విషయానికి వస్తే కేవలం అప్లికేషన్ చార్జీల కింద గత ఏడాది జనవరి 12న రూ.పది వేలు చెల్లించి వదిలేశారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో ఎలాంటి ప్లాన్ లేకుండానే అడ్డగోలుగా భవన నిర్మాణం పూర్తిచేసేశారు. అధికారం కోల్పోవడంతో ఎక్కడ ఇబ్బందులు వస్తాయోనని భయంతో ఇప్పుడు ప్లాన్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. దీని కోసం ఈ నెల 17న గ్రామ పంచాయతీ చార్జీలు కింద కట్టాల్సిన రూ.4.44 లక్షలు చెల్లించారు. మిగిలిన ఫీజులను మాత్రం ఇంకా చెల్లించకపోవడంతో ప్లాన్ అప్లికేషన్ ఇంకా ఎల్‌టీపీ లాగిన్ నుంచి జీవీఎంసీ లాగిన్(డీపీఎంఎస్)కు చేరలేదు.

ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ప్లాన్ అనుమతి లేకుండానే వైసీపీ కార్యాలయ భవన నిర్మాణం పూర్తిచేసేయడంతో దీనిపై జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే ఆసక్తి నెలకొంది. భవన నిర్మాణానికి ముందే ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్లాన్ అప్రూవ్ అయిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలి. అలా కాకుండా ప్లాన్ జారీ కాకుండానే భవన నిర్మాణం చేపట్టినా, పూర్తిచేసినా సరే అక్రమ నిర్మాణంగానే పరిగణిస్తారు. తీసుకున్న ప్లాన్‌కు చిన్నపాటి ఉల్లంఘనలతో నిర్మాణాలు చేశారని ఆరోపిస్తూ అనేక భవనాలను కూలగొట్టేసిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు.. ఎలాంటి ప్లాన్ లేకుండానే నిర్మాణం పూర్తిచేసిన వైసీపీ భవనం విషయంలో ఎలా ముందుకువెళతారో చూడాలి.

క్రైం... crime news

మద్యం మత్తులో అన్నదమ్ముల ఘర్షణ

- ఒకరి మృతి
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- పోలీసులు కేసు నమోదు

పాడేరురూరల్, జూన్ 20: మద్యం మత్తులో అన్నదమ్ముల (చిన్నాన్న, పెదనాన్న) పిల్లలు మధ్య జరిగిన ఘర్షణలో దాగిరి సూరిబాబు (63) మృతి చెందిన ఘటన మండలంలోని మినుములూరులో బుధవారం చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని మినుములూరులో దాగిరి సూరిబాబు, దాగిరి నరసింహామూర్తి చిన్నాన్న, పెదనాన్న పిల్లలు. వీరు నిత్యం మద్యం సేవించి చిన్న చిన్న విషయాలపై తరచూ ఘర్షణ పడుతూనే ఉంటారు. అదే విధంగా ఈనెల 18వ తేదీ మంగళవారం రాత్రి వీరిద్దరూ మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. బుధవారం ఉదయం చూసే సరికి సూరిబాబు మృతి చెందాడు. రాత్రి జరిగిన ఘర్షణలో కొట్టడం వల్లే మృతి చెందాడంటూ సూరిబాబు మృతదేహాన్ని కుటుంబ సభ్యులు నరసింహామూర్తి ఇంటి వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం సాయంత్రం సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. గురువారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని సూరిబాబు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయమై సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్ మాట్లాడుతూ..సూరిబాబుది హత్య కాదని, సాధారణ మరణంగానే కనిపిస్తుందన్నారు. కేసు నమోదు చేసి గ్రామంలో దర్యాప్తు నిర్వహించామని ఆయన తెలిపారు.

జిల్లాకు 850 పశువుల గోకులం షెడ్లు మంజూరు

- పశుసంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నరసింహ


మాట్లాడుతున్న డీడీ నరసింహ

కోటవురట్ల, జూన్ 20: జిల్లాకు 850 పశువుల గోకులాల షెడ్లు మంజూరు అయినట్టు పశుసంవర్ధక శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ నరసింహ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు చెందిన పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులాల షెడ్లు పశువులు పెంపకందారులకు మాత్రమే మంజూరు చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రతి మండలానికి 40 నుంచి 45 వరకు గోకులాల షెడ్లు కేటాయిస్తామన్నారు. ఈ సీజన్‌లో అధికంగా పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు సోకే ప్రమాదం వుందన్నారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా వ్యాక్సిన్లు వేయాలని సూచించారు. సమావేశంలో ఏడీ సింహాద్రప్పడు, వైద్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

చోడవరం, జూన్ 20: పట్టణంలో ఈ నెల 22, 23 తేదీల్లో సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వెంకన్న గురువారం తెలిపారు. చోడవరంలో రెండు రోజుల పాటు నిర్వహించే జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులలో ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యల పరిష్కారం, ఇతర సమస్యలపై పోరాటాలకు సీపీఎం కార్యకర్తలు ప్రణాళిక రూపొందించనున్నారన్నారు.

నీట్‌ను మళ్లీ నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ ర్యాలీ


ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై నిరసన ర్యాలీ చేపట్టిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ఎలమంచిలి, జూన్ 20: దేశ వ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరుతూ శనివారం ఎలమంచిలి ప్రధాన రోడ్డుపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. బాలాజీ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. రాష్ట్రాల హక్కులు, స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్నారు. పరీక్షల నిర్వహణ నుంచి ఎన్‌టీఏను తప్పించాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేందుకు పరీక్ష మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు కేశవ, శ్రీను, అప్పలరాజు విజయ్, గణేష్ పాల్గొన్నారు.

యోగా ఆకారంలో విద్యార్థుల వినూత్న విన్యాసం


యోగా గుర్తు విన్యాసాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం, జూన్ 20: మండలంలోని గుడివాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గురువారం యోగా ఆకారంలో వినూత్న విన్యాసాన్ని ప్రదర్శించారు. శుక్రవారం జరిగే ఇంటర్నేషనల్ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్‌చార్జి హెచ్‌ఎం మహేశ్వరి ఆధ్వర్యంలో పాఠశాల పీడీ కందూరు రాజు యోగా గుర్తు ఆకారంలో విద్యార్థులతో వినూత్నంగా విన్యాసాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకొంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, పద్మావతి, భవానీ పాల్గొన్నారు.

నేడు పాఠశాలల్లో సూర్య నమస్కారాలు

కొత్తూరు, జూన్ 20: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వాటికి సంబంధించిన ఫొటోలు వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులందరూ దిగువ తరగతులైన 1 నుంచి 6 వరకు విద్యార్థులకు మంచి పునాదిని వేసి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చేలా బోధన చేయాలని పేర్కొన్నారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, జూన్ 20: దంతెవాడ, కామలూరు స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖ-కిరండోల్ ఎక్స్‌ప్రెస్ (18514) ఈనెల 21 నుంచి 25 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18513) ఈనెల 22 నుంచి 26 వరకు దంతెవాడ నుంచి విశాఖకు రాకపోకలు సాగిస్తాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

అచ్యుతాపురానికి మంచి రోజులు

- ఐదేళ్ల వైసీపీ పాలనలో క్షీణించిన పారిశుధ్యం
- పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా పట్టించుకోని పాలకులు
- కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే 'సుందరపు' ప్రత్యేక దృష్టి
- అద్దంలా తీర్చిదిద్దాలన్న ఆదేశాలతో అధికారుల్లో కదలిక

అచ్యుతాపురం, జూన్ 20 : పారిశ్రామికంగా శరవేగంతో అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో పారిశుధ్యం క్షీణించింది. గడచిన ఐదేళ్లలో ఇక్కడ ఈ సమస్యను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో ఎటుచూసినా చెత్తాచెదారం, ఏ కాలువ చూసినా మురుగుతో దర్శనమిచ్చేవి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలమంచిలి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సుందరపు విజయ కుమార్ తొలుత ఇక్కడి పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా విభాగాల్లో కదలి ఏర్పడి, పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. అచ్యుతాపురం రెండు పంచాయతీల పరిధిలో ఉంది. అచ్యుతాపురం జంక్షన్‌తో పాటు పూడిమడక రోడ్డులో గల రామాలయం వరకు మోసయ్యపేట పంచాయతీ పరిధిలో ఉండగా, అక్కడ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో ఉంది. అయితే గడచిన ఐదేళ్లలో అచ్యుతాపురం, మోసయ్యపేట పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు జరగలేదు. ముఖ్యంగా ఇక్కడ డ్రైనేజీ ప్రధాన సమస్యగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు అచ్యుతాపురం జంక్షన్ రోడ్లగుండా పారుతుంది. పంచాయతీలకు నిధుల కొరత కారణంగా గత వైసీపీ పాలనలో పారిశుధ్య సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలు కావడం, కూటమి అధికారంలోకి రావడంతో ఈ ప్రాంత ప్రజల్లో కొత్త ఆశలు రేకెత్తించాయి. అందుకు అనుగుణంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముందుగా అచ్యుతాపురం జంక్షన్‌పై దృష్టి సారించారు. కాలువలు అధ్వానంగా ఉండంతో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు యుద్ధప్రాతిపదికన యంత్ర సహాయంతో పనులు ప్రారంభించారు. ముందుగా కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ట్రాక్టర్లపై తరలిస్తున్నారు.


ఎలమంచిలి రోడ్డులో డ్రైనేజీలపై వేసిన పలకలను తొలగిస్తున్న దృశ్యం


పూడిమడక రోడ్డులోని కాలువల్లో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

కాలువలపై ఉన్న సిమెంటు పలకలను తొలగించి ఎక్స్‌కవేటర్ సహాయంతో పూడికను తీయిస్తున్నారు. అలాగే కాలువలను వెడల్పు చేస్తున్నారు. అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలిలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యేక ఆర్థిక మండల (సెజ్) ముఖ ద్వారమైన అచ్యుతాపురం జంక్షన్ గురించి వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. సెజ్‌లో కర్మాగారాలకు ఎవరు వెళ్లాలన్నా. అచ్యుతాపురం జంక్షన్ మీదుగానే చేరుకోవాల్సి ఉంటుందన్నారు. కర్మాగారాలకు విదేశీయులు ఎక్కువగా వస్తున్న తరుణంగా ఇకపై వారు సైతం మెచ్చేలా ఈ జంక్షన్ తీర్చిదిద్దుతామని వివరించారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు


నీటిలో యోగాసనాలు వేస్తున్న నరసింగరావు

తుమ్మపాల, జూన్ 20: యోగాతో బహుళ ప్రయోజనాలున్నాయని శ్రీకృష్ణ యోగా సెంటర్ గురువు బుదిరెడ్డి నరసింగరావు పేర్కొన్నారు. యోగా చేయడం ద్వారా జీవన విధానాల్లో మార్పు, వ్యాధి నిరోధక, ఆరోగ్య అభివృద్ధి చెందుతుందన్నారు. యోగా సాధనతో ఆయుష్షు పెంచుకోవచ్చునన్నారు. తుమ్మపాలలో విద్యార్థులకు ఉచితంగా యోగా, స్విమ్మింగ్ నేర్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాదక ద్రవ్యాల వాడకంతో జీవితాలు నాశనం

ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.జైసింహా చౌదరి

అనకాపల్లి టౌన్, జూన్ 20 : యువత మాదక ద్రవ్యాల జోలికి పోయి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.జైసింహా చౌదరి కోరారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై స్థానిక శ్రీకన్య జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.శైలజారాణి, ఇన్‌స్పెక్టర్లు డి.అనిల్‌కుమార్, జి.శ్రీనివాసరావులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పరశురామ బ్రాహ్మణ సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లి టౌన్, జూన్ 20: పరశురామ పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం నూతన అధ్యక్షులుగా భోగలింగేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు పేరూరి చిన్నిస్వామిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షులుగా చుండూరి సత్యనారాయణమూర్తి, గౌరవ సలహాదారులుగా రాంపల్లి అన్నపూర్ణ శర్మ, ఉపాధ్యక్షులుగా చావలి వెంకట రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా తమ్మిరాజు శ్యామ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా వాహినీపతి సంతోష్‌కుమార్, కోశాధికారిగా తణికెళ్ల రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాచకొండ రవికుమార్, అధికార ప్రతినిధిగా గంటి రవికుమార్‌తో పాటు తొమ్మిది మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

సీడ్ డ్రిల్ ద్వారా వరి విత్తే పద్ధతిపై అవగాహన

ఎలమంచిలి, జూన్ 20: మునిసిపాలిటీలోని రామారాయుడుపాలెంలో గురువారం రైతులకు సీడ్ డ్రిల్ ద్వారా వరి విత్తే పద్ధతిపై వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో ఎకరానికి 20 కేజీల విత్తనం అవసరం అవుతుందని, విత్తనంతో పాటు ఎరువు కూడా ఒకేసారి కలిపి వేయవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

'అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'


విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జూన్ 20: నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూళ్లతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల కోసం అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జి.ఫణేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి భారీగా వసూళ్లకు ప్రైవేటు యాజమాన్యాలు పాల్పడుతున్నాయన్నారు. కనీసం ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ ఎఫ్ నాయకులు బి. బాబ్జి, జగదీష్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

25న సీజ్ చేసిన రేషన్ బియ్యం వేలం

ఎలమంచిలి, జూన్ 20: మండలంలో వివిధ 6 ఏ కేసులలో సీజ్ చేసిన 15.224 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఈనెల 25వ తేదీన ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద వేలం పాట నిర్వహిస్తామని తహసీల్దార్ అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు వెళ్లి బియ్యం నిల్వను పరిశీలించుకోవచ్చునన్నారు. సంబంధిత వివరాలు జిల్లా పౌరసరఫరాల అధికారి, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ్యాల్లోని నోటీసు బోర్డులో ఉంచడమైనదన్నారు. మరిన్ని వివరాల కోసం ఎలమంచిలి సివిల్ సప్లయ్ ఉప తహసీల్దారును 9493357555లో సంప్రదించాలని కోరారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కోరిబిల్లి


విజయవాడలో మంత్రి లోకేశ్‌ను కలిసిన కోరిబిల్లి లోవరాజు

ఎస్.రాయవరం, జూన్ 20: మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోరిబిల్లి లోవరాజు గురువారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వీఆర్‌ఏల సమస్యలను సంఘం తరుపున మంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చినట్టు లోవరాజు తెలిపారు.

మంత్రి 'నిమ్మల'ను కలిసిన సుందరపు


నిమ్మల రామానాయుడుతో విజయకుమార్

అచ్యుతాపురం, జూన్ 20 : నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడిని సచివాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గంలో గల శారదా నది, కొండకర్ల ఆవ తదితరాలపై చర్చించారు

తుమ్మపాలలో విత్తనాల పంపిణీ

తుమ్మపాల, జూన్ 20: రాయితీపై విత్తనాల పంపిణీని గురువారం ఇక్కడ ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి రంగాచారి, నాయకులు కర్రి బాబి, సత్యవతి, తట్టా పెంటయ్యనాయుడు, బొడ్డపాటి రామ్‌కుమార్, పీలా విశ్వేశ్వరరావు, రాపేటి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

దేవస్థానం భూముల కౌలుకు వేలం పాట

రోలుగుంట, జూన్ 20: మండలంలోని కంచుగుమ్మల గ్రామంలోని సత్యనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన భూములను మూడేళ్లకు కౌలు ఇవ్వడానికి గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. సర్వే నంబరు 7లోని 5.10 ఎకరాల భూమి, సర్వే నంబరు 224/1లోని 3.14 ఎకరాల భూమి కౌలును వేలంలో ఇద్దరు దక్కించుకున్నట్టు దేవస్థానం ఈవో కిరణ్మయి తెలిపారు. కాగా సర్వే నంబర్లు 18, 21/2లలో గల భూముల వేలంపాటకు పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది.

ఘనంగా దుర్గమాంబ పండగ



పరవాడ, జూన్ 20 : మండల కేంద్రం పరవాడలో దుర్గమాంబ పండగ గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త పైలా పోతునాయుడు కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మీశ్రీనివాస్ దంపతులతో పాటు సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, టీడీపీ నాయకులు పైలా సన్యాసిరావు, పైలా రామచంద్రరావు, పెద్ద చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నారు.

మారేడుపూడిలో మరిడిమాంబ వేడుక

అనకాపల్లి రూరల్, జూన్ 20 : మారేడుపూడిలో మరిడిమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సర్పంచ్ సాలాపు కనకరాజులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు ఈగల రాము నాయుడు, టీడీపీ నాయకులు బాదపు రాంబాబు, ఈగల వెంకునాయుడు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోవిందపాలెంలో అమ్మవార్ల జాతర

రాంబిల్లి, జూన్ 20 : గోవిందపాలెంలో దుర్గాలమ్మ, బంగారమ్మ జాతరలను గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవార్లకు పసుపు కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

23న కూటమి విజయోత్సవ సభ

▸▸ అచ్యుతాపురంలోని మైదానంలో నిర్వహణ ▸▸ వివరాలు వెల్లడించిన నాలుగు మండలాల నాయకులు



హరిపురంలో జనసేన పార్టీ కార్యాలయంలో సమావేశమైన నియోజకవర్గ కూటమి నాయకులు

రాంబిల్లి, జూన్ 20 : కూటమి విజయోత్సవ భారీ బహిరంగ సభను ఈనెల 23వ తేదీ ఆదివారం అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ వద్ద గల మైదానంలో నిర్వహించనున్నట్టు ఎలమంచిలి నియోజకవర్గ కూటమి నాయకులు తెలిపారు. మండలంలోని హరిపురంలో గల జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాలకు చెందిన నాయకులు సమావేశమయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం ఆదివారం ఎలమంచిలి నియోజకవర్గానికి వస్తున్న ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌లకు ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేయనున్నామన్నారు. ఆరోజు ఉదయం ఎనిమిది గంటలకు ఎలమంచిలి వద్ద గల పులపర్తి జంక్షన్ వద్ద నుంచి ఎంపీ, ఎమ్మెల్యే భారీ బైక్ ర్యాలీ ద్వారా ఎలమంచిలి, నారాయణపురం, ఎస్ఈజెడ్ కాలనీ మీదుగా అచ్యుతాపురం చేరుకుంటారన్నారు. అనంతరం అక్కడి పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఈ వేడుక జరుగుతుందని వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాల్సిందిగా పిలుపునిచ్చారు. కూటమి నాయకులు బైలపూడి రామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, రాజాన రమేష్‌కుమార్, వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, ధూళి రంగనాయకులు, డీఎస్ఎన్‌రాజు, దాడి ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు, జూన్ 20 : అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో ఉన్న 33/11కేవీ, కశింకోట సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పనులు చేపట్టనున్నామని వివరించారు. ఈ కారణంగా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు వేటజంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం, విస్సన్నపేట, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

గొడిచెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

నక్కపల్లి : గొడిచెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకూ పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్)ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనున్నందున గొడిచెర్ల, ఉద్దండపురం, ఉప్పర జానకయ్యపేట, దేవవరం, వడ్డిమెట్ట, చినరాంభద్రపురం, వేంపాడు కొత్తూరు, చేరి కొత్తూరు, నామవరం, గుంటపల్లి, రామభద్రపురం కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉందని వివరించారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

'ఓవర్ లోడుతో వెళితే జరిమానా'

అచ్యుతాపురం, జూన్ 20 : అధిక లోడుతో వెళ్లే వాహనాలకు జరిమానా తప్పదని సీఐ బుచ్చిరాజు తెలిపారు. గురువారం చోడపల్లి వద్ద తనిఖీ చేశారు.

పెన్షనర్ల సమస్యలపై సుదీర్ఘ చర్చ

ఎస్.రాయవరం, జూన్ 20 : మండలంలోని ధర్మవరం అగ్రహారంలో గురువారం ఆల్ పెన్షనర్స్, రిటైర్డు పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కేవీఎస్ సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.పి.కుమార్‌లు పెన్షనర్ల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈపీఎఫ్ 95 పెన్షనర్ల డిమాండ్లపై నూతనంగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులకు మెమోరాండం సమర్పించడంతో పాటు ఆగస్టు ఆరో తేదీ నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలోని పార్లమెంటు భవనం వద్ద జరిగే ధర్నాను విజయయంతం చేయాల్సిందిగా వారు కోరారు. ఈ సమావేశంలో పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో డ్రైనేజీ పనులు ప్రారంభం

అచ్యుతాపురం, జూన్ 20 : రామన్నపాలెంలో డ్రైనేజీ పనులను సర్పంచ్ ధర్మిరెడ్డి నాయుడు బాబు (డ్రీమ్స్ నాయుడు) గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాలం సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు డి.సన్యాసినాయుడు, శ్రీను, తాతబాబు, లక్ష్మి, సత్యనారా యణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



భూసార పరీక్షల ద్వారా ఎంతో మేలు

నక్కపల్లి, జూన్ 20 : భూసార పరీక్షల ద్వారా భూసారాన్ని నిర్ధారించుకోవచ్చునని, ఇందుకోసం మండలంలోని అనేక గ్రామాల్లో 409 మట్టి నమూనాలను సేకరిస్తున్నామని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ తెలిపారు. గురువారం ఉద్దండపురం క్లస్టర్ పరిధిలో మట్టినమూనాల సేకరణపై రైతు భరోసా కేంద్రం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వరి రైతుకు దక్కని మద్దతు

... 5వ పేజీ తరువాయి

పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రాల వినియోగం, కూలీల ఖర్చులతో కలుపుకుని నాలుగేళ్ల క్రితం వరకు ఎకరానికి రూ.20 వేలు నుంచి రూ.25 వేలు పెట్టుబడి అయితే, ఇప్పుడు పెట్టుబడి రూ.40 వేలు చేరిందని రైతులు వాపోతున్నారు. వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల బెడద లేకపోతే ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. ఏ మాత్రం వాతావరణం సహకరించకపోయినా పంట చేతికి అందే పరిస్థితి కూడా కష్టమే. ప్రస్తుత ఖర్చులతో సరిచూస్తే వరిసాగుకు అయ్యే పెట్టుబడి చేతికి అందే పరిస్థితి కనిపించకపోవడంతో వరి పండించే అన్నదాతలు సరుగుడు వంటి ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు, వలస కూలీలుగా మారిపోతున్నారు.

మద్దతు ధర చాలా తక్కువగా ఉంది

వరి పంటకు గిట్టుబాటు ధర క్వింటాలుకు రూ.117 పెంపు చాలా తక్కువగా ఉంది. ఈ ధర వల్ల మాకు న్యాయం జరగదు. పండే భూములను ఖాళీగా ఉంచలేక వరి సాగు చేస్తున్నాం తప్పితే, వరి పంట వల్ల బాగుపడింది లేదు. మా పెట్టుబడి డబ్బులు మాకు వస్తే చాలన్నట్టుగా ఉంది పరిస్థితి. కనీసం క్వింటాలుకు రూ. 3500 ఇచ్చినా బాగుంటుంది.

- యాళ్ల అమ్మతల్లినాయుడు,
రైతు, ఖండివరం, చీడికాడ మండలం

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

కశింకోట, జూన్ 20 : ఏఎస్‌పేటలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ మందపల్లి శివ ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సమస్య ఉన్నవారు ఉదయం పది గంటల నుంచి ప్రారంభం కానున్న ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

'బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి'

సబ్బవరం, జూన్ 20 : బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు లక్ష్మణరావు, బీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బడిఈడు పిల్లలు, బడిమానేసిన పిల్లలు ఉంటే గుర్తించి జూలై 17వ తేదీ వరకు నిర్వహించనున్న 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా కోరారు. సీడీపీవో లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.





నర్సీపట్నం
నియోజకవర్గం

ఘనంగా కామధేనువు అమ్మవారి పండుగ


అమ్మవారిని దర్శించుకున్న తహసీల్దార్ మోహన్‌రావు

మాకవరపాలెం, జూన్ 20 : మండలంలో శెట్టిపాలెం గ్రామంలో కామధేనువు అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి దూరంగా ఉన్న కామధేనువు అమ్మవారి గుడి వద్ద గురువారం తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. సర్పంచ్ అల్లు రామునాయుడు అధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో అమ్మ వారిని ఊరేగించారు. తహసీల్దార్ మురళీ మోహన్‌రావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వో కుమారి గ్రామ పెద్దలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

జనసేనలో మాజీ కౌన్సిలర్ చేరిక


జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఇన్‌చార్జి సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, జూన్, 20: నర్సీపట్నం మునిసిపాలిటీకి చెందిన వైసీపీ మాజీ కౌన్సిలర్ వర్రే శ్రీనివాసరావు గురువారం నర్సీపట్నం జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్య చంద్ర ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, పవన్ కల్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షుడు అద్దేపల్లి గణేశ్, గొలుగొండ మండల జనసేన అధ్యక్షుడు గండెం దొరబాబు, పలు మండలాలకు చెందిన జనసేన నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక నిల్వలపై దాడులు


తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్, మైన్స్ శాఖల అధికారులు

గొలుగొండ, జూన్ 20 : ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఇసుక నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు, మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ గురువారం దాడులు చేశారు. మండలంలోని గుండుపాల రెవెన్యూలో జి.కొత్తూరు రాజులబాబు గుడి వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించి స్థానికులతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ కె.రవికుమార్ మాట్లాడుతూ.. రాజులబాబు గుడి వద్ద నిల్వ చేసిన ఇసుకకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఇసుకను స్థానిక వీఆర్వో, సచివాలయ మహిళా పోలీసులకు అప్పటించినట్లు తెలిపారు. దీనిపై పూర్తి స్థాయి నివేదిన ఏడీమైన్స్‌కు అందిస్తామన్నారు. ఆయన ఆదేశాలు మేరకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంలో అందరూ భాగస్వాములు కావాలి
▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు



కృష్ణాదేవిపేటలో రక్తదానం చేస్తున్న యువకులు

కృష్ణాదేవిపేట, జూన్ 20 : అత్యవసర పరిస్థితుల్లో సాటి మనిషి ప్రాణాలు కాపాడాలంటే ప్రతి ఒక్కరూ రక్తదానంలో భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు పిలుపునిచ్చారు. గురువారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పరిసర ప్రాంతాల యువకులు 89 మంది రక్తందానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పరమేశ్వరావు చేతుల మీదుగా 100 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి సంక్షేమ, అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో ఉద్యోగులు, ప్రజలు నానాకష్టాలు పడ్డారని అందుకే ఓటర్లు వైసీపీకి సరైన గుణపాఠం చెప్పారన్నారు. రాష్ట్రంలో బీజేపీ మరింతగా బలోపేతం అయ్యేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వర్మ, కొండబాబు, తామరన ఎర్రినాయుడు, అరియెల రాజు, రేముల చంద్రరావు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

వైభవంగా అప్పికొండమ్మ పండుగ


ఆలయం వద్ద భక్తుల సందడి

కృష్ణాదేవిపేట, జూన్ 20 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట (ఏఎల్‌పురం)లో గురువారం అప్పికొండమ్మ అమ్మవారి పండుగను గ్రామస్థులు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. అమ్మవారికి భక్తులు ఉదయం నుంచి కొబ్బరికాయ, అరటిపళ్ళు, పసుపు, కుంకుమలతో పాటు చీరలు సమర్పించారు. కొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పండుగకు కొయ్యూరు, గొలుగొండ, నర్సీపట్నం తదితర మండలాలకు చెందిన పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఇటు ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద టెంటలు, తాగునీరు, తీర్థప్రసాదాలు తదితర వసతులను ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తూ సంబరాన్ని నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాతవరంలో 'బడికి పోతాం' ర్యాలీ


ర్యాలీలో పాలొన్న ఉపాధ్యాయులు

నాతవరం, జూన్ 20 : బడి ఈడు పిల్లలను స్కూలు చేర్పాలంటూ గురువారం నాతవరంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వరహాలబాబు మాట్లాడుతూ'బడికి పోతాం' కార్యక్రమాన్ని ప్రభుత్వం జూన్ 17 నుంచి జులై 12 వరకు ఏర్పాటు చేసిందన్నారు. నాతవరం మెయిన్‌రోడ్డులో విద్యార్థులు మానవహారంగా ఏర్పాడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీఆర్‌పీలు అంకంరెడ్డి శ్రీనువాసరావు, పోలుపర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గొలుగొండ, జూన్ 20 : మండల సర్వసభ్య సమావేశంలో గల మూడు నెలల క్రితం సర్వ సభ్యసమావేశంలో వెల్లడించిన పలు సమస్యలు నేటికీ పరిష్కరించలేదని పలు శాఖల అధికారులను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. మండలంలో మండలపరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మణికుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రత్నకుమారి, జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు, పలుశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కాదర్ములు రఘురాం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిరసన


తాగునీటి కోసం నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు, స్థానికులు

మాకవరపాలెం, జూన్ 20: తామరం శివారు కామేశ్వరినగర్‌లో తాగునీటి వసతి కల్పించాలంటూ టీడీపీ నాయకులు, స్థానికులు నిరసన చేపట్టారు. గురువారం ఉదయం కామేశ్వరినగర్ కాలనీలోని మంచినీటి పథకం వద్దకు స్థానికులు చేరుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఈ కాలనీలో ఉన్న రెండు వార్డుల్లో అత్యధికంగా టీడీపీ సానుభూతిపరులు ఉండడంతో ఇక్కడి వైసీపీ సర్పంచ్ తాగునీటి సరఫరాలో పక్షపాతం చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఇంటింటి కొళాయిలు కూడా వైసీపీ మద్దతుదారులకే వేసుకున్నారన్నారు. రెండు వార్డుల్లో ఉన్న ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి వసతి కల్పించాలని, లేనిపక్షంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోసూరు శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు పి.లోవకుమారి, కిల్లాడ రాజు, స్థానికులు పాల్గొన్నారు.

వరి రైతుకు దక్కని మద్దతు

... 5వ పేజీ తరువాయి

పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్రాల వినియోగం, కూలీల ఖర్చులతో కలుపుకుని నాలుగేళ్ల క్రితం వరకు ఎకరానికి రూ.20 వేలు నుంచి రూ.25 వేలు పెట్టుబడి అయితే, ఇప్పుడు పెట్టుబడి రూ.40 వేలు చేరిందని రైతులు వాపోతున్నారు. వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల బెడద లేకపోతే ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. ఏ మాత్రం వాతావరణం సహకరించకపోయినా పంట చేతికి అందే పరిస్థితి కూడా కష్టమే. ప్రస్తుత ఖర్చులతో సరిచూస్తే వరిసాగుకు అయ్యే పెట్టుబడి చేతికి అందే పరిస్థితి కనిపించకపోవడంతో వరి పండించే అన్నదాతలు సరుగుడు వంటి ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు, వలస కూలీలుగా మారిపోతున్నారు.

మద్దతు ధర చాలా తక్కువగా ఉంది



వరి పంటకు గిట్టుబాటు ధర క్వింటాలుకు రూ.117 పెంపు చాలా తక్కువగా ఉంది. ఈ ధర వల్ల మాకు న్యాయం జరగదు. పండే భూములను ఖాళీగా ఉంచలేక వరి సాగు చేస్తున్నాం తప్పితే, వరి పంట వల్ల బాగుపడింది లేదు. మా పెట్టుబడి డబ్బులు మాకు వస్తే చాలన్నట్టుగా ఉంది పరిస్థితి. కనీసం క్వింటాలుకు రూ. 3500 ఇచ్చినా బాగుంటుంది.

- యాళ్ల అమ్మతల్లినాయుడు, రైతు, ఖండివరం, చీడికాడ మండలం

చోడవరం
నియోజకవర్గం

కోనాంలో 25 మందికి వైద్య పరీక్షలు



చీడికాడ, జూన్ 20 : కోనాం హెల్త్ సబ్ సెంటర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 25 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరినాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ మొల్లి వరలక్ష్మి, ఏఎన్ఎం, ఆశవర్కర్లు సేవలందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య
▸▸ ఎంఈవోలు వెల్లడి ▸▸ గ్రామాల్లో 'నేను బడికిపోతా' పేరిట ర్యాలీలు


రోలుగుంట మండలం కంచుగుమ్మలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ


చోడవరం మండలం అంభేరుపురంలో పిల్లలతో మానవహారం నిర్వహిస్తున్న టీచర్లు

చోడవరం, జూన్ 20 : బడిఈడు పిల్లలు బడిలో చేరేలా ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేయాలని కోరుతూ మండలంలోని గజపతినగరం, అంబేరుపురం గ్రామాల్లో గురువారం 'నేను బడికిపోతా' పేరిట ర్యాలీలు, మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు జయలక్ష్మి, కె.సింహాచలం మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా విధిగా బడిలో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగిస్తున్నట్టు ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కె.నాయుడుబాబు తెలిపారు. గురువారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు దాటిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిందిగా కోరారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

చిరువర్తకులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే రాజును సత్కరించి, సమస్యలు వివరించిన చిరువర్తకులు

చోడవరం, జూన్ 20 : పట్టణంలోని చిరువర్తకులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజును ఇక్కడి సిద్ధివినాయక పండ్ల వర్తకుల సంఘానికి చెందిన చిరువ్యాపారులు గురువారం కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరువ్యాపారులకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనన అంతా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు, కార్యదర్శి ఆబోతుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు పల్లా వెంకట అప్పారావు, రాయిశెట్టి నూకరాజు, మల్లా సన్యాసిరావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు కక్కుతున్న భానుడు.. అల్లాడుతున్న జనం


మధ్యాహ్నం పన్నెండు గంటలకు బోసిపోయి కనిపిస్తున్న కె.కోటపాడులోని ప్రధాన రోడ్డు

కె.కోటపాడు, జూన్ 20 : వర్షా కాలం ఆరంభమైనప్పటికీ భానుడు నిప్పులు కురిపిస్తుండడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుండడంతో పాటు వడగాల్పుడు వీస్తుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో ఉదయం పది గంటల నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఒకవేళ తప్పనిసరి స్థితిలో వచ్చినా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో పరిస్థితి మరి దారుణంగా ఉంటుంది. జన సంచారం పెద్దగా లేక చాలా వరకు రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. తాజా వాతావరణానికి పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

కింతలి వల్లాపురంలో పుస్తకాలు పంపిణీ



మాడుగుల రూరల్, జూన్ 20 : కింతలి వల్లాపురం ఎంపీపీ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి చేతులు మీదుగా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోవింద్, ఎంపీటీసీ వరహాలమ్మ, కార్యదర్శి అప్పారావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు : ఆర్ఐ

రోలుగుంట, జూన్ 20 : గ్రామాల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని ఆర్ఐ రామ్మూర్తి హెచ్చరించారు. ఎస్.కొత్తూరు సమీపంలో ఉన్న చెరువు, పంట పొలాల్లో అనుమతులు లేకుండా జేసీబీతో తవ్వకాలు చేపడుతున్నారని అధికారులకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో వెంటనే స్పందించారు. ఈ మేరకు సిబ్బందితో ఆర్ఐ వెళ్లి సదరు ప్రాంతాలను పరిశీలించారు. సిబ్బందిని చూసి జేసీబీ, ట్రాక్టర్లతో పరారయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఎక్కడ తవ్వకాలు చేపట్టినా అనుమతులు తప్పనిసరని ఆర్ఐ పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆట పాటలతో విద్య
▸▸ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి


ఎల్‌బీపీఅగ్రహారంలో పిల్లలతో కలిసి రాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, జూన్ 20 : ఆట పాటల ద్వారా పిల్లలను పాఠశాల పట్ల ఆకర్షితులను చేయడమే అంగన్‌వాడీ కేంద్రాల లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి అన్నారు. లోపూడి సచివాలయం పరిధిలో గురువారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఐదు సంవత్సరాలు నిండిన పిల్లల్ని స్కూల్ పంపించడానికి వీడ్కోలు పలుకుతూ, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలని అంగన్‌వాడీ కేంద్రాల్లోకి స్వాగతిస్తూ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో అంగన్‌వాడీలు కుసుమ కుమారి, జ్యోతి, లలిత, సత్య ధనలక్ష్మి, నూకరత్నం, వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

రాజాంలో ప్రభుత్వ భూములు స్వాధీనం
▸▸ కార్యదర్శి, వీఆర్వో ఫిర్యాదులపై అధికారులు చర్యలు

బుచ్చెయ్యపేట, జూన్ 20 : రాజాంలో రూ.కోటి విలువైన రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజావసరాల నిమిత్తం సర్వే నెంబరు 382-2లో రహదారి నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు కార్యదర్శి నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. ఈ నిర్మాణాన్ని ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న ఆక్రమణదారులు అడ్డగించారు. పాలక వర్గం తీర్మానంతో సాంకేతిక ఆమోదం అనంతరం చేపడుతున్న రహదారి నిర్మాణానికి అడ్డుకోవడం తగదని కార్యదర్శి నాగేశ్వరావు తెలిపినా, ఆక్రమణదారులు నిర్మాణ పనులు సాగనీయలేదు. దీనిపై తహసీల్దార్, పోలీసులకు పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వీఆర్వో తులసీరావు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్, ఎస్ఐ డి.ఈశ్వరరావు సిబ్బందితో కలిసి ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్ఐ హెచ్చరించారు.

చినపాచిలిలో బోరు ఆక్రమణపై ఫిర్యాదు

రావికమతం, జూన్ 20 : చినపాచిలిలో రక్షిత మంచి నీటి పథకం ట్యాంకు కోసం వేసిన బోరును స్వప్రయోజనాలకు వాడుకుంటున్న వ్యక్తిపై స్థానిక ఉప సర్పంచ్ కోమటి శంకరావు రావికమతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2019లో గ్రామంలో మంచినీటి ఎద్దడి నివారణ నిమిత్తం ప్రభుత్వం ఇరవై బోర్లు వేసిందన్నారు. ఇందులో భాగంగా డాబా కాలనీలో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణం చేయడంతో పాటు తాగునీరు సరఫరా చేయాలన్న ఉద్దేశ్యంతో బోరు వేసి మోటారు బిగించారన్నారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో రక్షిత మంచినీటి పథకం ట్యాంకును నిర్మించలేకపోయామని వివరించారు. ఇదే అదునుగా గ్రామానికి చెందిన వ్యక్తి భావించి ప్రభుత్వ నిధులతో వేసిన బోరు, అందులో ఉన్న మోటారును తన ఇంటి నీటి అవసరాలకు వినియోగించుకుంటున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి బోరు ఆక్రమణను వెంటనే తొలగించాల్సిందిగా ఆయన కోరారు.

'యోగా గురువులకు ఉపాధి కల్పించాలి'


పుల్లేటి సతీష్

చోడవరం, జూన్ 20 : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో యోగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీష్ గురువారం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యోగా విద్యనభ్యసించిన అనేకమంది నిరుద్యోగులుగా ఉన్నారని, వారందరికీ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం భరోసా కల్పించేలా నిర్ణయం ప్రకటించాలని కోరారు. ఇదిలావుంటే, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గురువారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్‌లివింగ్ యోగా ఇనిస్టిట్యూట్, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి యోగా వల్ల ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ, యోగా ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.